క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న వైద్యురాలు వరలక్ష్మి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద బోట్ క్లబ్ ఉద్యానవనంలో పారిశుధ్య కార్మికులకు ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. పార్కు ఆరోగ్య పరిరక్షణకు, వాకింగ్‌కు వచ్చేవారికి సౌలభ్యం కోసం చెత్తను తొలగించేందుకు వారి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టరు శ్రీధర్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష తెల్ల జిల్లేడు పువ్వులతో గణపతికి పూజలు



తెల్లజిల్లేడు పుష్పాల అలంకరణలో భోగిగణపతి

బోట్‌క్లబ్: స్థానిక భోగిగణపతి పీఠంలో 232వ సంకష్టహర చతుర్థి సందర్భంగా సోమవారం గణపతికి లక్ష తెల్ల జిల్లేడు పువ్వులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 60 మంది చైత్రమాస చతుర్థి ఉపవాసకులతో సుప్రభాత వేళలో పీఠం మాడ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ నగర సంకీర్తన జరిగింది. తెల్ల జిల్లేడు పుష్పాల పాలవెల్లితో సహస్ర నామ పారాయణ లక్ష ఒత్తులతో దీపారాధన పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తెల్లజిల్లేడు పుష్పాలతో గణేశుడికి పూజలు చేస్తే సకల పాపాలు హరించి కర్మలు పరిహార మవుతాయన్నారు.

రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

కాకినాడ రూరల్: సూర్యారావుపేటలో యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ కంపెనీ వద్ద సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి హరిబాబు, వైద్య సిబ్బంది నేతృత్వంలో సుమారు 60 మంది కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాతలను డాక్టరు హరిబాబు అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ కంపెనీ జనరల్ మేనేజరు వసంతరావు, జెమిని ఎడిబుల్స్ జనరల్ మేనేజరు గురు ప్రసాద్, డాక్టరు నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన అర్జీలు



పండూరులో స్పెషల్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన అర్జీదారులు

కాకినాడ రూరల్: పండూరు గ్రామంలో మండల స్థాయి అధికారులు సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌కు గ్రామస్తుల నుంచి అర్జీలు పోటెత్తాయి. ఈనెల 12న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. అప్పట్లో పూర్తి గ్రామంలో ప్రజలు అవసరాలు తెలుసుకునేందుకు ఇంటింటికి సర్వే నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కుమారి, ఎంపీడీఓ సతీష్ వివిధ శాఖల అధికారులు గ్రామ సచివాలయంలో స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించగా మొత్తం 350 అర్జీలు అందాయి. వీటిలో అత్యధికంగా ఇళ్ల స్థలాలు కోసం 139, పింఛన్ల కోసం 101అర్జీలు, రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో మార్పులకు 53, డంపింగ్ యార్డు కోసం తదితర వాటిపై అర్జీలు వచ్చాయి.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట: వేట్లపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన రామాలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్ని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఉపసర్పంచ్ వల్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాణ్యతకు తూట్లు!

- కాకినాడ రూరల్‌లో కోట్ల రూపాయలతో ఉపాధి పనులు
- కాంట్రాక్టర్లు, కూటమి నాయకులకు పండగ
- ఇష్టారాజ్యంగా రోడ్ల నిర్మాణాలు
- కొరవడిన పర్యవేక్షణ
- మండలంలో ఖాళీగా ఏఈఈ పోస్టు
- పర్యవేక్షణ బాధ్యతతో చక్రం తిప్పుతున్న ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు



వాకలపూడిలో జనావాసాలు లేని చోట నిర్మించిన సిమెంట్ రోడ్డు



ప్రారంభోత్సవానికి ముందే వాకలపూడిలో సిమెంట్ రోడ్డుపై బాటలా ఏర్పడిన గొయ్యి

కాకినాడ రూరల్: వడ్డించే వాడు మనవాడైతే చాలు.. చివరి బంతిలో ఉన్నా సరే అన్ని వంటకాలు వస్తాయన్నట్టు.. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమ గుప్పెట్లో ఉంటే చాలు పనులు ఎలా చేపట్టినా బిల్లులు వస్తాయన్నట్టుగా కాకినాడ రూరల్‌లో కాంట్రాక్టర్లు, కూటమి నాయకులు తీరు ఉంది. పల్లె పండగ పేరిట ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లతోపాటు బీటీ రోడ్లు ప్రతిపాదించి పనులు జోరుగా చేపడుతున్నారు. ఇప్పటికి దాదాపు 80శాతం వరకు పనులు పూర్తి చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.20.56కోట్లతో పల్లె పండగ పేరిట ఉపాధి హామీ నిధులతో రోడ్లు నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిలో కాకినాడలో అత్యధికంగా సుమారు రూ.14కోట్లు, కరప మండలంలో రూ.6కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు. మరిన్ని నిధులకు పనులు ప్రతిపాధించారు. ఇంత వరకు బాగానే ఉన్నా అసలు విషయం ఏమిటంటే.. అవసరం ఉన్నా లేకున్నా రోడ్లు మాత్రం ఎడా పేడా వేసేస్తూ పల్లెలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తున్నారు. రోడ్లు వేస్తున్నారు కదా పది కాలాలు పాటు అవి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటే పరవా లేదు. కానీ వేసిన రోడ్ల నాణ్యతకు తూట్లు పడడంతో కొన్ని చోట్ల అప్పుడే సిమెంట్ రోడ్లపై సిమెంట్ కంకర పైకి కనిపిస్తోంది. వేసి రోడ్లపై ద్విచక్ర వాహనాలు వెళ్లిన ఆనవాళ్లలో గంతలుగా మారి కనిపిస్తున్నాయి. కాకినాడ రూరల్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ మండల పరిషత్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఏఈఈ) లేరు. చాలా నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో కరప ఏఈఈ శైలజ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

> **ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పర్యవేక్షణ బాధ్యతలు**
>
> కాకినాడ రూరల్ మండలంలో మండల పరిషత్ ఏఈఈ పోస్టు ఖాళీగా ఉండడంతో తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టాను. ఇప్పుడు నా బదులుగా ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పర్యవేక్షణ బాధ్యలు అప్పగించారు. వారే మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుని పనులకు రికార్డు వర్కు చేస్తున్నారు. చెక్ పవర్ డీఈఈ చూస్తున్నారు.
>
> – శైలజ, ఏఈఈ, కరప మండలం



రమణయ్యపేటలో ఏడీబీ రోడ్డు సమీపంలో ఎవరి కోసం వేశారో ఈ అతుకుల సిమెంట్ రోడ్డు

అధికారులను చెప్పు చేతల్లో పెట్టుకుని..

కరప మండలంలో పాటు కాకినాడ బాధ్యతలు కష్టతరంగా ఉండడంతో ఆమె కాకినాడ రూరల్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గత ప్రభుత్వం నుంచి తిష్ఠ వేసిన ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంతో ఏఈఈ వారే ఏఈగా ఫీలవుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను తమ చెప్పు చేతల్లో పెట్టుకుని చక్రం తిప్పుతున్నారు. వీరి డైరెక్షన్‌లో పనులు జరుగుతుండడంతో పర్యవేక్షణ కొరవడింది. నాణ్యతను గాలికి విడిచిపెట్టి బిల్లులు కోసం రికార్డు వర్కు చేస్తున్నారు. సాధారణంగా సీసీ రోడ్డు నిర్మాణం జరిగిన 23రోజులు వరకు వాటరింగ్ జరగవల్సి ఉంటుంది. ఆ తరువాతే రికార్డు వర్కు చేపట్టాలి. ఇవేమి పట్టకుండా తమకు కావల్సిన వారికి రోడ్డు వేసిన మరుసటి నుంచి ఎం.బుక్ రికార్డు వర్కు చేపడూ కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగానికి ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కారణమవుతున్నారు.

నామినేషన్ పేరుతో రూ.కోట్లలో వర్కులు ఒకరికే..

ఉపాధి హామీ నిధులతో రోడ్డు పనులకు టెండర్లు పిలిచే పని లేకపోవడంతో నామినేషన్ పద్ధతిపై నియోజకవర్గ ప్రజా ప్రతినిధి, ఎమ్మెల్యే సూచించిన వారికి పనులు కేటాయిస్తున్నారు. ఎమ్మెల్యేకు బంధువుగా కాకినాడ రూరల్ చలామణి అవుతున్న ఒక కాంట్రాక్టరు «వేణు»గానం విన్నట్టుగా ఆయన చేసే పనులకు పర్యవేక్షణ లేకుండా పోయింది. ప్రస్తుతం జరుగుతున్న రూ.20 కోట్ల పనుల్లో రూ.10 కోట్లు వరకు ఆయనే వర్కులు చేపడుతున్నాంటే అతడి ప్రభావం అర్థం చేసుకోచ్చు. ఉపాధి పనులతో పాటు మరో రూ.5కోట్ల వరకు ఆర్థిక సంఘ నిధులు సుమారు రూ.5కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి పైపులైన్ పనులు సదరు అనుచర కాంట్రాక్టరు పనులు చేపడుతున్నారు. పనులు నాణ్యతపై విమర్శలు తలెత్తడంతో పలువురు విజిలెన్స్ ఎంక్వాయిరీకి ఫిర్యాదులకు సిద్ధమవుతున్నారు.

గంగాలమ్మ తల్లి ఆలయ శిఖర ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో గ్రామ దేవత గంగాలమ్మ తల్లి ఆలయ శిఖర ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం శిథిల స్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు, దాతలు సహాయ సహకారాలతో ఇటీవల పునర్నిర్మించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10.22 గంటలకు హోమాలు, శిఖర ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, గోదర్శనం అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు దర్శించుకున్నారు.

డ్రైన్లు నిర్మించాలి

కరప: గ్రామంలోని నక్కావారి ఎస్సీవీధి, పల్లపు వీధి తదితర ప్రాంతాల్లో డ్రైన్లు లేక రోడ్లపైనే మురికినీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయా వీధుల మహిళలతో కలిసి సీపీఎం, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, రాష్ట్ర ఐద్వా సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి, చీకట్ల వెంకటలక్ష్మి ఆయా వీధుల్లో పర్యటించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ ఎం.అనుపమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. బల్లి లక్ష్మి, పి.వీరవేణి, బి.సూరిబాబు, పి.దుర్గ, కె.మహాలక్ష్మి, ఎస్.పాప, ఎస్.సత్యవేణి, బి.కామేశ్వరి, మందనక్క గోవిందరాజు, ఎం.ప్రసాద్, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



కరప హైస్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కరప: మండల పరిధిలో సోమవారం పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. కరప, వేళంగి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 909 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 901 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. పెద్దాపురప్పాడు హైస్కూలులో 175 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారన్నారు. కరపలో ఏ, బీ సెంటర్లలో 353 మందికి 348 మంది, వేలంగి కేంద్రంలో 175 మందికి 173 మంది, గొర్రిపూడిలో 229 మందికి 228 మంది పరీక్ష రాశారు. మండలంలో ఎటువంటి మాలప్రాక్టీస్ జరగలేదని ఎంఈఓలు వివరించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

సీతారామమూర్తి విగ్రహం ఏర్పాటు చేయాలి

బోట్‌క్లబ్: సుదీర్ఘ కాలంగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహించిన జ్యోతుల సీతారామమూర్తి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. స్థానిక సూర్యసౌధా అపార్ట్‌మెంట్‌లో సోమవారం ఆంధ్రకాపు సద్భావన సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాకినాడ నగరానికి ఎంతో ఖ్యాతి తీసుకొచ్చిన కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దివంగత మల్లిపూడి శ్రీరామ్ సంజీవరావు కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఇరువురి చరిత్రను భావితరాలకు తెలియజేసేలా కాకినాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని సంఘం ఏకగ్రీవ తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, సంఘ ఉపాధ్యక్షుడు అడపా ప్రకాష్ నాయుడు, సభ్యులు సేతు మాధవరావు, గొల్లపల్లి లక్ష్మణరావు, జల్లి రంగనాయకులు, దామిశెట్టి శ్రీనివాసు, నిరంజన్ నాయుడు, పేపకాయల లక్ష్మణరావు, మాధవరపు పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

తాగునీరు వృథా



కరప హైస్కూలులో ట్యాప్‌ల మరమ్మతులతో వృథాగా పోతున్న తాగునీరు

కరప: తాగునీరు వృథా చేయకూడదు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలంటున్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, ఆచరణలో కనబడడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దానికి హైస్కూలులో విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మంచినీరు పట్టుకునేందుకు, చేతులు కడుక్కునేందుకు మెయిన్ గేట్‌కు పక్కన, ఎండీఓం షెడ్ వద్ద రెండు చోట్ల కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ కుళాయిలకు ట్యాప్‌లు పాడవ్వడంతో మంచినీరు వృథాగా పోతోంది. అధికారులు, ఉపాధ్యాయులు ఈ కుళాయిల పక్కన నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అధికారులు, ఉపాధ్యాయులు స్పందించి కొత్త ట్యాపులు అమర్చి, నీటి వృథాను తగ్గించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఆస్తులు అమ్ముకున్న బాధతో ఆత్మహత్య

- పండూరులో విషాద ఛాయలు



బావిశెట్టి వెంకటేశ్వరరావు(ఫైల్)

కాకినాడ రూరల్: అప్పులు ఊబిలో చిక్కుకుని ఆస్తులు అమ్ముకుని ఆ బాధతో పండూరు గ్రామానికి చెందిన బావిశెట్టి వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వరరావు ఇటీవల తనకున్న నాలుగు ఎకరాల పొలాన్ని అమ్మి అప్పులు కొంత వరకు తీర్చాడు. తర్వాత హైదరాబాద్ వెళ్లి అక్కడ ఉంటున్నాడు. అంతకు ముందు సుమారు 8 ఎకరాల వరకు విక్రయించాడు. మొత్తం పొలం 12 ఎకరాలను అమ్ముకోవడంతో ఊరి నుంచి మకాం మార్చాడు. ఆ బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో వాకలపూడిలోని లారీ ట్యాంకర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు పని చేశారు. వైఎస్సార్ సీపీలో గతంలో పని చేసిన ఆయన ఎన్నికల ముందు జనసేనలో చేరారు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు హరి విజయనగరంలో మెడిసిన్ విద్యను అభ్యసిస్తున్నాడు. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు మృతితో పండూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చారు. గ్రామంలో అంత్య క్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలియజేశారు. క్రికెట్ బెట్టింగ్‌ల కారణంగా అప్పుల పాలయ్యాడని గ్రామంలో చర్చించుకుంటున్నారు.

ప్రజల్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- నిరుద్యోగ భృతి, తల్లికి వందనం ఇప్పించాలంటూ ధర్నా
- జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం



రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఆందోళనకారులు

కాకినాడ సిటీ: ఉద్యోగాలు ఇవ్వలేదు., కనీసం రూ.3 వేలు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వండంటూ అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ గీతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని లేకుంటే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్స కాలం పూర్తవుతున్నా ఆ ఊసే లేదన్నారు. కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారని, అందరినీ మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎం.వీరబాబు, గోనెల నాగభూషణం, బొండా మైకేల్, పి.ప్రసాద్, నాని సూరంపూడి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు.

నగరంలో పేరుకుపోయిన చెత్తను తొలగించండి

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలో నిలిచిపోయిన క్లాప్ వాహనాలు నడిపించాలని, కార్పొరేషన్ వాహనాలకు రిపేర్లు చేయించాలని, నగరంలో పారిశుధ్యం మెరుగుపరచాలని సీపీఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11వ తేదీ నుంచి ప్రజా చైతన్య యాత్ర పేరుతో నగరంలో వివిధ ప్రాంతాల్లో సీపీఎం బృందం పర్యటించింది. క్లాప్ వాహన కాంట్రాక్టర్ వాహనాలకు గ్యాస్, పెట్రోల్ ఇవ్వకపోవడంతో ఈనెల ఒకటో తేదీ నుంచి తడి, పొడిచెత్త సేకరించే వాహనాలు నిలిచిపోయాయన్నారు. గత మూడు నెలలుగా డ్రైవర్లకు జీతాలు కూడా అందలేదన్నారు. కార్పొరేషన్ సొంత వాహనాలైన కాంపాక్టర్స్ కూడా రిపేర్లు ఉండడం వల్ల, సకాలంలో రిపేర్లు చేయించకపోవడం నగరంలో చెత్తను డంపింగ్ యార్డ్ చేర్చడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీంతో నగరంలో ఎటు చూసిన చెత్తే దర్శనమిస్తోంది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి నగరంలో పారిశుధ్యం మెరుగుపరచాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు. లేని పక్షంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద త్వరలో ఆందోళన చేపడతామని పలివెల వీరబాబు తెలిపారు.

20న జాబ్ మేళా

కాకినాడ సిటీ: స్థానిక అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో ఈనెల 20వ తేదీన జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.అనంతలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 500 ఉద్యోగాలకు జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో డిగ్రీ, పీజీ, ఐటీఐ, పదో తరగతి, పాలిటెక్నిక్ చదివిన స్త్రీలు మాత్రమే పాల్గొనాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ వెంట విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని జవహర్ విజ్ఞాన కేంద్రంలో సంప్రదించాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లెల సువర్చల తెలిపారు.

ఈ జాబ్ మేళాలో మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్, కీర్తనా ఫిన్‌సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, జోయాలుక్కాస్ జ్యువెలర్స్, ఫాక్స్‌కాన్, డైకిన్, బ్లూ స్టార్, పేటీఎం, ముత్తూట్ ఫైనాన్స్, కోజెంట్ ఈ-సర్వీసెస్, బీపీవో సాఫ్ట్‌వేర్ కన్సల్టింగ్, యెకోహామా ఏహెచ్‌టి ఇండియా లిమిటెడ్, ఏటీసీ టైర్స్, ఏపీ అపోలో ఫార్మసీ, టీవీఎస్ ఇండియాస్ లిమిటెడ్ చెన్నై, బీటీఎస్ కాకినాడ సంస్థలతో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ తెలిపారు.

గవర్నర్‌తో జేఎన్‌టీయూకే వీసీ భేటీ

- స్నాతకోత్సవం, పలు అంశాలపై చర్చ



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ సోమవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. వర్సిటీలో త్వరలో నిర్వహించే 11వ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. రాష్ట్రంలో సాంకేతికంగా జేఎన్‌టీయూ కాకినాడకు ప్రత్యేక గుర్తింపు ఉందని, వర్సిటీలో చేపడుతున్న మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రీసెర్చ్ స్కాలర్స్‌తో పాటు పీజీ విద్యార్థులకు ప్రోత్సహించాలని, అందరు సమష్టి సహకారంతో వర్సిటీను అభివృద్ధి పదంలో నడిపించాలని గవర్నర్ సూచించారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వీసీ ప్రసాద్ సత్కరించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కరపలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మండల పెన్షనర్లు

కరప: రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ కరప మండలశాఖ అధ్యక్షుడు ఎంవీ రాఘవస్వామి, జిల్లా సంయుక్త కార్యదర్శి పెదిరెడ్డి తాతారావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల పెన్షనర్స్ తమడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షుడు రాఘవస్వామి, జిల్లా సంయుక్త కార్యదర్శి తాతారావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సదరు బకాయి సొమ్ములు తీసుకోకుండానే చాలామంది మరణిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత పీఆర్సీలో తగ్గించిన ఎడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పూర్వ పద్ధతిలో 70 సంవత్సరాలు 10 శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం పునరుద్ధరించాలన్నారు. ఈహెచ్ఎస్ కార్డుపై వైద్యం చేయమని, మెడికల్ రీఎంబర్స్‌మెంట్‌పై చేయించుకోవాలని ఆసుపత్రుల యాజమాన్యం చెపుతున్నారని, ఆర్థిక వెసులుబాటు లేక చాలామంది వైద్యం చేయించుకోలేకపోతున్నారన్నారు. క్యాష్‌లెస్ పద్ధతిలో ఈహెచ్ఎస్ కార్డుపై వైద్యం చేయించేలా చర్యలు తీసుకోవాలని మండల పెన్షనర్స్ కోరారు. మండలశాఖ కార్యదర్శి ఆర్.పెదసత్తిరాజు, అడపా వెంకటేశ్వర్లు, పీఎస్ఎస్‌వీవీఎస్ఆర్ శర్మ, కాకినాడ ఈశ్వరరావు తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తీ నిత్య విద్యార్థే



వర్క్ షాపులో మాట్లాడుతున్న ఆర్‌అండ్ డీ డైరెక్టర్ రవీంద్ర

బాలాజీచెరువు: ప్రతి వ్యక్తీ నిత్య విద్యార్థే అని, టీచింగ్ లేదా నాన్ టీచింగ్ విభాగం సిబ్బంది అయినా నిత్యం నేర్చుకుంటేనే రాణించగలుగుతారని జేఎన్‌టీయూకే ఆర్‌అండ్ డీ డైరెక్టర్ వి.రవీంద్ర పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ బిల్డింగ్ పీజీ బ్లాక్‌లో సోమవారం నాన్ టీచింగ్ సిబ్బందికి ట్యాలిపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ మనకు ఏదైనా ఒక అంశంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సరైన పద్ధతిలో విధులు నిర్వర్తించగలమన్నారు. అభ్యసన అనేది నిరంతర ప్రక్రియ అని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి కోటేశ్వరరావు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుబ్బారావు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.